సాక్షి
వరంగల్
మంగళవారం | 25 | జూలై | 2023



'సాగు' ముమ్మరం

ఇటీవల కురుస్తున్న వర్షాలతో వివిధ పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. - 8లో▸



కాళోజీ ఖ్యాతిని తెలిపేలా నిర్మాణం

కాళోజీ ఖ్యాతిని తెలిపేలా కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం ఉండాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$28^0 / 24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం అయి ఉంటుంది. పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యూ-విన్ పోర్టల్‌పై శిక్షణ



గీసుకొండ: సార్వత్రిక వ్యాధి నిరోధక టీకా కార్యక్రమానికి సంబంధించి యూ-విన్ పోర్టల్‌పై వరంగల్, హనుమకొండ జిల్లాలకు సంబంధించిన మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, సంబంధిత సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇరు జిల్లాల డీఎంహెచ్‌ఓలు డాక్టర్ కె.వెంకటరమణ, డాక్టర్ సాంబశివరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చల్లా మధుసూదన్, డాక్టర్ గీతాలక్ష్మిలు పోర్టల్ గురించి శిక్షణలో అవగాహన కలిగించారు. గర్భిణులు, పిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకా వివరాల యూ-పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇంటెన్సిఫైడ్ ఇంద్రధనస్సు కార్యక్రమం ద్వారా ఆగస్టు 7న పోర్టల్ అమలులోకి వస్తుందన్నారు.

బాధ్యతలు స్వీకరించిన నర్సంపేట ఏసీపీ



నర్సంపేట: నర్సంపేట నూతన ఏసీపీగా పుష్పాల తిరుమల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏసీపీ సంపత్‌రావు ఇంటెలిజెన్స్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. కాగా నూతన ఏసీపీగా తిరుమల్ బాధ్యతలు స్వీకరించగా సీఐలు, ఎస్సైలు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

దళితబంధు-2 దరఖాస్తులకు ప్రత్యేక సెల్

కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో దళితబంధు-2 పథకానికి దరఖాస్తులు అందించేందుకు సోమవారం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. హనుమకొండ కలెక్టర్ ఆదేశం మేరకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బల్దియా వ్యాప్తంగా 66 డివిజన్లలోని ఎస్సీ కమ్యూనిటీకి చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. దళితబంధు-2 పథకాన్ని పొందేందుకు దరఖాస్తు, ఆధార్‌కార్డ్, కులం, ఆదాయం తదితర సర్టిఫికెట్లను జత చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అవకాశాన్ని ఆయా వర్గాలు వినియోగించుకోవాలని కోరారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి

- గంగదేవిపల్లిని సందర్శించిన ఇథియోపియా ప్రతినిధులు



గీసుకొండ: సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఇథియోపియా దేశస్తులు అభిప్రాయపడ్డారు. మండలంలోని జాతీయ ఆదర్శగ్రామం గంగదేవిపల్లిని ఇథియోపియా దేశానికి చెందిన వారితోపాటు మన దేశానికి చెందిన పలువురు సోమవారం సందర్శించారు. రెండు వారాలుగా బాలవికాస పీపుల్స్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న ఇథియోపియా యూత్ అండ్ కల్చరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ సంస్థ నుంచి గెటాబిల్, బ్రూక్, జనామెునా, గిర్‌మో, అలాగే ఇనిషియేటివ్ సంస్థ నుంచి యోహువాలా, ఏపీలోని ఒంగోలు జిల్లా ప్రేరణ సంస్థ నుంచి డాక్టర్ శివానీ రామతులసి, పాండిచ్చేరి ఆత్మ సంస్థ నుంచి శాంతివేలు, వరంగల్ జిల్లా నుంచి విద్యార్థులు సుప్రీత, సతీష్ గ్రామాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు. వారికి గ్రామాభివృద్ధి, ఆదర్శంగా నిలిచిన తీరును జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, గూడ సంపత్‌రెడ్డి వివరించారు.

న్యాయం చేయండి

- వీ హబ్ ఉద్యోగాల్లో గోల్‌మాల్‌పై కలెక్టర్‌కు అభ్యర్థుల ఫిర్యాదు
- ఆ మూడు పోస్టులకు రీ నోటిఫికేషన్ ఇవ్వాలని అభ్యర్థన
- 'సాక్షి' కథనాలను కలెక్టర్‌తో ప్రస్తావించిన ఉద్యోగార్థులు



కలెక్టరేట్‌కు వచ్చిన అభ్యర్థులు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న అభ్యర్థులు

సాక్షి, వరంగల్: జిల్లా సంక్షేమ విభాగంలో జరుగుతున్న ఉద్యోగ నియామకాల్లో అనర్హులకు అందలం ఎక్కించారంటూ 'వీ హబ్ ఉద్యోగాల్లో గోల్‌మాల్' అంటూ సాక్షిలో వచ్చిన కథనాలపై అభ్యర్థులు సోమవారం కదలి వచ్చారు. వరంగల్ కలెక్టర్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు అభ్యర్థులు అవకతవకలపై విచారణ చేసి అర్హులైన వారికి న్యాయం చేయాలని కలెక్టర్ ప్రావీణ్యను వేడుకున్నారు. ఇప్పటికే కొత్త మిషన్ శక్తి పథకం కింద డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌కు సంబంధించి కాంట్రాక్ట్ బేసిస్‌కు చెందిన ఈ జిల్లా మిషన్ కో ఆర్డినేటర్, టెండర్ స్పెషలిస్ట్, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్సియల్ లిటరసీ పోస్టులకు తిరిగి అకడమిక్ మార్కులు చెక్ చేయడంతోపాటు అనుభవం ఉన్న సంస్థలో పనిచేశారా.. లేదా.. అని పరిశీలించడంతోపాటు ఇంటర్వ్యూలు నిర్వహించాలని లేదా.. తిరిగి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ఇటీవల సాక్షిలో వచ్చిన 'అకడమిక్ మార్కులున్నా అంతే.. వీ హబ్ ఉద్యోగాల్లో గోల్‌మాల్' అంటూ వచ్చిన కథనాలను వినతిపత్రానికి జతపరిచి కలెక్టర్ ప్రావీణ్యకు అందజేయడం గమనార్హం. అయితే అక్కడే ఉన్న జిల్లా సంక్షేమ శాఖ విభాగాధికారి శారదకు ఈ మూడు పోస్టులకు ఎంపిక చేసిన విధానంతోపాటు సంబంధిత పత్రాలు సరైనవా, కాదా.. అని మంగళవారంలోపు సమాధానం ఇవ్వాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. అయితే విచారణ బాధ్యతలు అదే శాఖ అధికారికి అప్పగించడం సరికాదని ఇతర అధికారికి అప్పగించి పూర్తిస్థాయిలో విచారించాలని అభ్యర్థులు వేడుకున్నారు.

ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు

కొత్త మిషన్ శక్తి పథకం కింద డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌కు సంబంధించి నాలుగు పోస్టుల కోసం 199 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ నియామకాల్లో అవకతవకలు జరిగాయని తెలియడంతో ఈ ఉద్యోగార్థులంతా ఒక్కటై పోరాడేందుకు వాట్సాప్ గ్రూప్ కూడా క్రియేట్ చేసుకున్నట్లు సమాచారం. ఐక్యంగా ఉండి ఉద్యోగ నియామకాలపై నిలదీసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

సమగ్ర విచారణ జరిపించాలి

కాశోజీ సెంటర్: శిశు సంక్షేమ శాఖలో జరిగిన ఉద్యోగాల భర్తీలో సమగ్రమైన విచారణ జరిపించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీవత్సను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ.. కొత్త మిషన్ శక్తి పథకం కింద శిశు సంక్షేమ శాఖలో నియమించిన నాలుగు పోస్టుల్లో సరైన పద్ధతిలో నియామకాలు జరగలేదని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అర్హతలో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా నియామకం జరిగిందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ సమగ్రమైన విచారణ జరిపించి అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చుక్క ప్రశాంత్, భూక్యా వినోద్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఐదో స్థానంలో ఉన్నవారికి ఉద్యోగం ఇచ్చారు..

ఫైనాన్షియల్ లిటరసీ జాబ్ కోసం దరఖాస్తు చేసుకున్న. సర్టిఫికేషన్ వెరిఫికేషన్‌లో మెరిట్ లిస్టులో ఉన్న. అయినా ఐదో స్థానంలో ఉన్నవారికి అనుభవం, ఇంటర్వ్యూలో ఎక్కువ మార్కులు వేసి ఉద్యోగం ఇచ్చారు. ఆ శాఖలో ఆమె బంధువులు ఉండడంతో జాబ్ ఇచ్చారు. డీడబ్ల్యూఓ ఆఫీసుకు వెళ్లి ప్రశ్నిస్తే చైల్డ్ లైన్ ఉద్యోగాల్లోనూ పక్కనబెట్టారు.

– బొజ్జ కల్పన, అభ్యర్థి

అర్హత లేకున్నా ఎంపిక చేశారు..

డిస్ట్రిక్ట్ మెషీన్ కో ఆర్డినేటర్ ఉద్యోగానికి ఎంపికైన యువతికి నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం సోషల్ సైన్స్, లైఫ్ సైన్స్, న్యూట్రిషన్, మెడిసిన్, హెల్త్ మేనేజ్‌మెంట్, సోషల్ వర్క్, రూరల్ మేనేజ్‌మెంట్‌లో ఏదైనా డిగ్రీ పాస్ అయి ఉండాలి. అయితే డిగ్రీలో ఈ అర్హతలు లేనివారికి ఉద్యోగం ఇచ్చారని తెలిసింది. ఇప్పటికైనా లోతుగా విచారణ చేసి అర్హులకు ఇంటర్వ్యూలు నిర్వహించాలి.

– అడ్డగట్ల ఉషశ్రీ, అభ్యర్థి

లోతైన విచారణ చేయాలి..

అవకతవకలు జరిగిన పోస్టుల నియామకాలపై లోతైన విచారణ చేసి అర్హులను ఎంపిక చేయాలి. అనుభవమున్నవారిని పరిగణనలోకి తీసుకోలేదు. అర్హతలున్న వారికి అవకాశం ఇవ్వాలి. ఇతర విభాగాధికారులతో విచారణ చేస్తే నిజాలు వెలుగులోకి వస్తాయి.

– శిరీష, అభ్యర్థి

'మిషన్ ఇంద్రధనుష్'ను విజయవంతం చేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'మిషన్ ఇంద్రధనుష్'ను విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ తయారు చేయాలని సూచించారు. రెండేళ్లలోపు పిల్లలకు, గర్భిణులకు టీకాలు వేయించడమే మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. వైద్య సిబ్బంది గ్రామాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వారీగా పిల్లలు, గర్భిణుల జాబితా తయారు చేసుకుని ఏ రోజు ఎక్కడ వ్యాక్సిన్ ఇస్తారు అనే సమాచారం తెలియజేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖతోపాటు వివిధ శాఖల సమన్వయం చాలా అవసరమని చెప్పారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జరిగే 'మిషన్ ఇంద్రధనుష్'లో వ్యాక్సినేషన్ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే డీడబ్ల్యూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నపిల్లలకు, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాల ద్వారా గ్రామాల్లో వ్యాక్సినేషన్ వేయించుకోని పిల్లల గురించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి వంద శాతం పూర్తి చేయాలని చెప్పారు. ఈ వ్యాక్సిన్‌ల వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడకుండా పిల్లల్ని కాపాడుకోవచ్చని తెలిపారు. జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ.. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడానికి మైక్రో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని, కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, డాక్టర్లు మధుసూదన్, ప్రకాష్, డాక్టర్ ప్రశాంతి, డీఈఓ వాసంతి, డీడబ్ల్యూఓ శారద, డీఆర్‌డీఓ సంపత్‌రావు పాల్గొన్నారు.

మళ్లీ వాన..!

- సాయంత్రం నుంచి మొదలైన వర్షం



వరంగల్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

కరీమాబాద్: రెండు రోజులుగా తెరిపిచ్చినట్టు చేసిన వరుణుడు మళ్లీ వచ్చాడు. ఆకాశానికి చిల్లులు పడినట్టుగా సాయంత్రం సుమారు ఐదు గంటల నుంచి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తోంది. దీంతో నగరంతోపాటు వర్ధన్నపేట, నర్సంపేట డివిజన్‌ల పరిధిలో కూడా వర్షం పడుతుంది. మొన్నటి వరకు ఎడతెరిపి లేకుండా పడిన వర్షం ఆదివారం, సోమవారం పగటిపూట తెరిపిచ్చి సాయంత్రం నుంచి మళ్లీ మొదలైంది. రాష్ట్రంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశముందని ప్రకటించిన వాతావరణ శాఖ రాష్ట్రంలో రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలలో కలవరం మొదలైంది. ఇదిలా ఉండగా పత్తి, మొక్కజొన్న చేలలో నీరు నిలిచి మొక్కలు ఎర్రబారి చనిపోతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

నేడు, రేపు భారీ వర్షాలు

హన్మకొండ : ఉపరితల ఆవర్తనం మూలంగా ఈనెల 25, 26 తేదీల్లో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే ములుగు, జనగామ, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

సమస్యల పరిష్కార వేదిక 'గ్రీవెన్స్'

- కలెక్టర్ ప్రావీణ్య
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ



గ్రీవెన్స్‌లో సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: ప్రజల సమస్యల పరిష్కారానికి 'గ్రీవెన్స్' వేదికగా నిలుస్తుందని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్‌లో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆర్జీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారులు గ్రీవెన్స్ సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఈవీఎం అవగాహన కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ గ్రీవెన్స్‌కు వచ్చే ప్రజలకు ఓటు హక్కు వినియోగం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు వేసే పద్ధతిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇదిలాఉండగా.. గ్రీవెన్స్‌లో మొత్తం 88 ఆర్జీలు రాగా.. వాటిలో భూములకు సంబంధించిన సమస్యలు 30 ఉన్నాయని వచ్చినట్లు అధికారులు తెలిపారు.

నా భూమిని ఇతరులకు పట్టా చేశారు



మా గ్రామంలో సర్వేనంబర్ 352/బీలో నాకు 2-20 ఎకరాల భూమి ఉండగా అందులో ఎకరం ఇతరుల పేరు మీద పట్టా చేశారు. తెలంగాణ పట్టాదారు పాసు బుక్కుల సందర్భంలో ఇది జరిగింది. అప్పటి నుంచి రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. రైతుబంధు, ప్రధానమంత్రి కిసాన్ డబ్బులు కూడా ఆ వ్యక్తికి వెళ్తున్నాయి. నా సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కలిశాను.

– పడిదల రాజేశ్వర్‌రావు, రోళ్లకల్, పర్వతగిరి

రికార్డుల్లో భూమి చూపిస్తలేదు..



247/ఇ సర్వేనంబర్‌లోని ఎకరం భూమి రికార్డుల్లో చూపిస్తలేదు. సర్వే చేయించినప్పుడు మా భూమి అని తేలింది. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలుసు. అయినా ఇప్పటికీ రికార్డుల్లో నా పేరు వస్తలేదు. మిస్సింగ్ సర్వే నంబర్ కోసం దరఖాస్తు చేసుకోమన్నారు. సమస్య పరిష్కారానికి కలెక్టర్‌ను కలిసి చెప్పాను.

– సంకటాల శాంతమ్మ, మొగిలిచర్ల, గీసుకొండ

మూడేళ్లుగా తిరుగుతున్నా..



నా భూమి చుట్టూ ఉన్నవాళ్లు నా భూమిని ఆక్రమించుకున్నారు. ఆక్రమించుకున్న 33 గుంటల భూమికి సంబంధించి సర్వే చేసి నా భూమి నాకు ఇప్పించాలని 3 ఏళ్లుగా తిరుగుతున్నా. రికార్డుల్లో నా పేరు మీద ఉన్న భూమి ఇతరుల ఆధీనంలో ఉంది. నా సమస్యలను పరిష్కరించాలని గ్రీవెన్స్‌లో ఆర్జీ పెట్టుకున్నా.

– గుంపుల మల్లయ్య, ముత్తోజిపేట, నర్సంపేట

పైసల్లేవు.. పనులు సాగవు!

జీడబ్ల్యూఎంసీకి ఆర్థిక ఇబ్బందులు

- రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.25.62కోట్లు
- కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.43.92కోట్లు
- కాంట్రాక్టర్లకు చెల్లించాల్సింది రూ.100కోట్లు
- నిధుల విషయంలో చొరవ చూపని పాలకులు, ఉన్నతాధికారులు
- నగరంలో అభివృద్ధి గాడి తప్పే ప్రమాదం!



వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థను ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. బల్దియాకు రావాల్సిన నిధులను తీసుకురావడంలో పాలకులు విఫలమయ్యారు. అస్తవ్యస్త విధానాలతో నిర్వహణ భారమైన పరిస్థితి ఏర్పడింది. ఈకష్టాల నుంచి గట్టెక్కాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి న్యాయబద్ధంగా కార్పొరేషన్‌కు రావాల్సిన బకాయి నిధులు రాబట్టుకోవడం ఒక్కటే ప్రధాన మార్గం. ఇందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే మరికొద్ది నెలల్లో వరంగల్ మహానగరంలో అభివృద్ధి గాడి తప్పే ప్రమాదం ఉందనే చర్చ జరుగుతోంది.

స్పష్టమైన ఆదేశాలు..

నిధులతో ఏ అభివృద్ధి పనులు చేపట్టాలనేది తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా వాహనాల కొనుగోలు, హరితహారంలో భాగంగా పచ్చదనం, ఆట స్థలాలు, ప్రజా మరుగుదొడ్లు, ఆటోస్టాండ్లు, డంపింగ్ యార్డులు, చెత్త శుద్ధీకరణ, భవన నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగానికి సీఎన్‌డీ ప్లాంట్లు, వెండింగ్ జోన్లు, వీధి దీపాలు, ప్రధాన రహదారుల అభివృద్ధి, వరద నీటి కాల్వలు, ఫుట్‌పాత్‌లు తదితర పనులకు నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఏడాది కాలంగా..

కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను గతేడాదిగా నిలిపేసింది. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్ నుంచి నిధులు విడుదల చేయట్లేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.25.62కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.43.92కోట్లు రావాల్సి ఉంది. దీంతో మహానగర పాలక సంస్థ ఆర్థిక స్థితి ఆగమ్యగోచరంగా మారింది. సాధారణ పన్నుల ద్వారా పరిపాలన నిర్వహణలో జీతాలు, కార్యాలయ, ఇంధనం, తదితర పనులను సరిపెడుతున్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులతో ఇతర పనులకు కేటాయించే పరిస్థితి ఏమాత్రం కనిపించట్లేదు. ఈనేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలయ్యే నిధుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది. అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు రూ.100 కోట్ల బకాయిలను జీడబ్ల్యూఎంసీ చెల్లించాల్సి ఉంది. బిల్లులు రాక వారు లబోదిబోమంటున్నారు. నిధుల విషయమై పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారులను వివరణ కోరగా.. ప్రభుత్వాల నుంచి విడుదల చేయాల్సి ఉందని, ఈ మేరకు పదే పదే లేఖలు రాస్తున్నట్లు పేర్కొన్నారు.

నిధులేవి?

స్థానిక సంస్థల ఆర్థిక మనుగడకు వీలు కలిగించేలా కొన్ని రకాల పన్నుల్లో నగర పాలక సంస్థలకు ప్రభుత్వాలు వాటాలు కల్పించాయి. అందులో భాగంగా జనాభా ప్రాతిపదికన మున్సిపాలిటీలకు, నగర పాలక సంస్థలకు కేంద్రం 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రేటర్ వరంగల్‌కు 2020 ఫిబ్రవరి నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతీనెల రూ.3.66 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రగతి ద్వారా రూ.3.66 కోట్లు విడుదల చేస్తోంది. ఇలా రూ.7.32కోట్లు మంజూరయ్యాయి. వీటితోపాటు ఆస్తి పన్ను, నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్, యూజర్ చార్జీలు, స్టాంపు డ్యూటీ, తదితర పన్నులతో బల్దియా పరిపాలన, ఇతర అభివృద్ధి పనులను కొనసాగిస్తూ ముందుకు సాగుతోంది. కేంద్రం సుమారు 28 నెలల పాటు రూ.102.48కోట్లు విడుదల చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం 34 నెలలు రూ.124.44కోట్లు మంజూరు చేసింది.

నిధులిస్తేనే పనులు

అభివృద్ధి పనులకు నిధులిస్తేనే చేస్తామని బల్దియా సివిల్ కాంట్రాక్టర్లు అల్టిమేటం జారీ చేశారు. ఈ మేరకు సోమవారం బల్దియాలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వారు కమిషనర్ షేక్ రిజ్వాన్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. బిల్లులు విడుదల చేయకపోతే ఆగస్టు 1 నుంచి నగర వ్యాప్తంగా అభివృద్ధి పనులు నిలిపివేసి సమ్మెబాట పడతామని స్పష్టం చేశారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి..

- పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై అదనపు కలెక్టర్ పరిశీలన
- హర్జ్యాతండాలో పర్యటించిన అశ్విని తానాజీ వాకడే



హర్జ్యాతండా డంపింగ్ యార్డు వద్ద అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

గీసుకొండ: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. మండలంలో ఎనిమిది గ్రామపంచాయతీలకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నాలుగేళ్ల క్రితం నియమించగా వారి పనితీరును పరిశీలించే క్రమంలో సోమవారం సాయంత్రం అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే హర్జ్యతండాను సందర్శించారు. ఫారెస్టు, పంచాయతీరాజ్‌శాఖ, పోలీసు అధికారులతో కలిసి గ్రామంలో వైకుంఠధామం, నర్సరీ, పల్లె ప్రకృతి వనాలు, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. వరంగల్-నర్సంపేట రహదారికి ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలు లేకపోవడంతో ఆమె పంచాయతీ కార్యదర్శి రమ్య పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎందుకు మొక్కలు లేవని ప్రశ్నించగా వాటిని రైతులు తొలగించారని, వారికి నోటీసులు ఇచ్చానని, త్వరలో మళ్లీ నాటిస్తానని పంచాయతీ కార్యదర్శి వివరణ ఇచ్చారు. డంపింగ్‌యార్డు, పల్లెప్రకృతి వనం గ్రామం నుంచి సుమారు కిలోమీటరు దూరంలో ఉండటంతో వాటి వద్దకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. డీపీఓ కల్పన, డీఎఫ్ఓ వసంత, ఎఫ్ఆర్ఓ సదానందం, ఎంపీడీఓ వీరేశం, ఎంపీఓ ప్రభాకర్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఖలీల్, ఎస్సై వెంకన్న, సర్పంచ్ ఆంగోతు కవిత, పంచాయతీ కార్యదర్శి రమ్య, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

రామన్నపేట: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్ల అనంతరం మిగిలిన సివిల్ ఇంజనీరింగ్ 12, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 47 సీట్ల స్పాట్ అడ్మిషన్‌కు మంగళవారం నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆకళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం.. ఈనెల 28న సీట్లు కేటాయించనున్నట్లు వివరించారు. సీటు కోసం అప్లై చేసుకున్న విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు నిర్ణీత ఫీజుతో ఈనెల 28న కళాశాలకు హాజరై అడ్మిషన్ పొందాలని సూచించారు. పాలిసెట్ పరీక్ష ఉత్తీర్ణులైన వారు లేదా పదోతరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 27లోపు వారి దరఖాస్తులు కళాశాలలో సమర్పించాలని సూచించారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు



నర్సంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కేక్ కట్‌చేశారు. వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. - నర్సంపేట

కాల్వలో బోల్తాపడిన స్కూల్ బస్సు

● పలువురు విద్యార్థులకు స్వల్పగాయాలు
● సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడమే కారణం



కాలువలో బోల్తాపడిన స్కూల్ బస్సు





గాయాలపాలైన విద్యార్థులు

కేసముద్రం: పాఠశాల నుంచి పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు మాదవశాత్తు రోడ్డు వెంట ఉన్న కాల్వలో బోల్తాపడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి, స్థానికుల కథనం ప్రకారం.. కేసముద్రంస్టేషన్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న 22 మంది విద్యార్థులను సోమవారం సాయంత్రం బస్సులో ఇంటికి తీసుకెళ్తున్నారు. బైపాస్ రోడ్డు మూలమలుపు సమీపానికి వచ్చిన సమయంలో.. డ్రైవర్ శ్రీకాంత్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తుండడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాల్వలో బోల్తా కొట్టింది. దీంతో బస్సులో ఉన్న పిల్లలంతా గట్టిగా అరుస్తూ కేకలు పెట్టారు. వెనకాల ఉన్న అద్దాన్ని డ్రైవర్ కాలుతో తన్నడంతో ఊడిపోగా.. బస్సులోని కొంత మంది పిల్లలను అతడు బయటకు తీశాడు. తర్వాత జనం గూమికూడుతున్న క్రమంలో డ్రైవర్ పరారయ్యాడు. స్థానికులు మిగతా పిల్లలను బస్సులో నుంచి సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటనలో బేరువాడకు చెందిన వర్షిత్, బోడమంచ్యాతండాకు చెందిన బోడ మణికంఠ, సిద్ధూ, ఆనంద్, చందన, ధరణితోపాటు పలువురు విద్యార్థులకు కంటి వద్ద, చేతులకు, వీపుభాగంలో గాయాలయ్యాయి. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే కాలువలో విపరీతంగా చెట్లతీగలు అల్లుకుపోవడం వల్ల బస్సు నెమ్మదిగా ఒరిగి కాలువకు మరోవైపు రాతిగోడకు తాకి పడటంతో పిల్లలకు పెద్దప్రమాదం తప్పినట్లు స్థానికులు చెబుతున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై తిరుపతి, తహసీల్దార్ సాంబశివుడు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా ఇదే బైపాస్ రోడ్డులో కొద్దినెలల క్రితం రోడ్డు వెంట ఉన్న వ్యవసాయబావిలో కారుపడి నలుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా జరిగిన ఘటన పట్ల పాఠశాల యాజమాన్యం బాధ్యత వహించాలంటూ, డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని యూత్‌కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు ఆ పాఠశాల వద్దకు చేరుకుని డిమాండ్ చేశారు.

'సాగు'ముమ్మరం..





మానుకోట మండలంలో సాగులో ఉన్న పత్తి, మొక్కజొన్న చేన్లు



విస్తారంగా కురుస్తున్న వర్షాలు

● వ్యవసాయ పనుల్లో అన్నదాతలు నిమగ్నం
● పంటల్లో చేపట్టాల్సిన చర్యలపై శాస్త్రవేత్తల సూచనలు

మహబూబాబాద్ రూరల్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు కొంత ఆలస్యమైనా ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్నాయి. ఫలితంగా చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మాలతి, శాస్త్రవేత్త ఎన్.కిషోర్‌కుమార్.. రైతులకు సూచనలు తెలిపారు.

పత్తి..

- సాధ్యమైనంత మేరకు పొలంలో నీరు నిలవ్వకుండా చూడాలి.
- నీరు నిల్వ ఉంటే కాలువలు ఏర్పాటుచేసి బయటకు పంపించాలి.
- వర్షాలు తగ్గిన తరువాత అదును చూసుకుని వీలైనంత త్వరగా అంతరకృషి (పాటు) చేయాలి
- దీని వల్ల భూమిలో తేమ తగ్గడం, వేర్లకు గాలి, పోషకాలు అందడంతో మొక్కలు త్వరగా సాధారణ స్థితికి వస్తాయి.
- భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు వేర్లు పోషకాలు, నీటిని తీసుకోలేక ఆకులు లేత ఆకుపచ్చ రంగులోకి మారుతాయి.
- దీనివల్ల పెరుగుదల తగ్గుతుంది. ఈ నేపథ్యంలో పైరుపై 10 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- భూమిలో అధిక తేమ ఉన్నప్పుడు వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయి.
- దీని నివారణకుగాను కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బండిజం 2 గ్రాములను లీటర్ నీటిలో కలిపి ద్రావణాన్ని తెగులు సోకిన మొక్క మొదళ్లలో పోయాలి.

మిరప..

- ప్రస్తుతం మిరప నారుమడి దశలో ఉంది.
- ఈ వర్షాల వల్ల నారుమడిలో నారుకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంది.
- దీని నివారణకుగాను మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- విత్తనం ఒత్తుగా విత్తొద్దు. నారుకుళ్లు కనిపించిన వెంటనే తడులను ఆపాలి.

ఆరుతడి పంటలు..

- మిగతా ఏ పంటలలోనైనా నీరు నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు వెళ్లిపోయేలా చూడాలి.
- వర్షాలు తగ్గిన తరువాత, అదునుచూసి అంతరకృషి చేయాలి.
- వేరుకుళ్లలాంటి తెగులు ఆశిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

వరినాట్లు..

- వరి ప్రస్తుతం నారుమడి దశలో ఉంది.
- నారు తీయడానికి ఏడురోజుల ముందు సెంట్ నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరుంచి వేయాలి.
- దీనివల్ల ప్రధాన పొలంలో వచ్చే ఉల్లికోడు ఉధృతిని, కాండం తొలుచు పురుగు ఉధృతి అరికట్టొచ్చు.
- నారు తీసేటప్పుడు మొక్కలు లేత ఆకుపచ్చగా ఉంటే మునా త్వరగా తిరుగుతుంది.
- నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించుకోవాలి.
- నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల బాటలు తీయడం వల్ల పైరుకు గాలి వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంత వరకు అదుపుచేయొచ్చు.
- ఈ గాలిబాటలు ఎరువులు చల్లడానికి, సస్యరక్షణ మందులు పిచికారీ చేసేటప్పుడు వెసులుబాటుగా ఉంటాయి.
- మొత్తం భాస్వరం ఎరువు దమ్ములోనే వేయాలి.
- పొటాష్ ఎరువులను రేగడి నేలల్లో ఆఖరి దమ్ములో పూర్తిగా ఒకేసారి వేయాలి.
- తేలిక భూముల్లో ఆఖరి దమ్ములో సగం అంకురం ఏర్పడే దశలో సగం వేయాలి.
- ఆఖరి దమ్ములో 20 కిలోల జింకు సల్ఫేట్ వేయాలి.
- రైతులు నారు పోసుకోవాలంటే స్వల్పకాలిక రకాలను వేసుకోవచ్చు.లేదా దమ్ము చేసిన పొలంలో వరిని నేరుగా విత్తే పద్ధతి ద్వారా, వెద జల్లే పద్ధతి లేదా డ్రమ్‌సీడర్ ద్వారా వేసుకోవాలి.
- ఈ పద్ధతిలో కాండం ధృడంగా ఉండే రకాలు ఎన్నుకుంటే బాగుంటుంది.

కేయూలో ప్రొఫెసర్ క్వార్టర్‌లో చోరీ



తలుపులు పగులగొట్టిన దుండగులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఓ ప్రొఫెసర్ క్వార్టర్‌లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగు చూసింది. ఆంగ్ల విభాగంలోఅసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన రేణుక.. ప్రొఫెసర్ క్వార్టర్ -2(పీ2)లో ఉంటున్నారు. క్వార్టర్‌కు తాళం వేసి ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడే కొద్దిరోజులుగా ఉన్నారు. ఈ క్రమంలో క్వార్టర్ తలుపులు పగలగొట్టి ఉన్నాయనే సమాచారం మేరకు రేణుక తన భర్తతో కలిసి హైదరాబాద్ నుంచి యూనివర్సిటీకి వచ్చారు. వెంటనే కేయూ సెక్యూరిటీ ఆఫీసర్, కేయూ పోలీస్టేషన్‌కు సమాచారం ఇవ్వగా.. ఎస్సై వచ్చి వివరాలు సేకరించారు. బీరువాలు తెరిచి సామన్లు చిందరవందర చేశారని, ఇతర విలువైన డాక్యుమెంట్లు కనపడటంలేదని పోలీసుకు ఫిర్యాదు చేశారు.

మెడికల్ షాపులో..

● రూ.15వేల నగదు అపహరణ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని ఆక్సిజన్ మెడికల్ షాపులో సోమవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. రఘునాథపల్లికి చెందిన బైరగోని నవీన్ అండర్‌పాస్ వద్ద మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి షాపు షెట్టర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లారు. ఉదయం షాపు తెరిచేందుకు రాగా షెట్టర్ తాళాలు పగులకొట్టి ఉన్నాయి. దీంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై రఘుపతి సిబ్బందితో కలిసి షాపు వద్దకు చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 15వేల నగదును అపహరించినట్లు గుర్తించారు. క్లూస్‌టీమ్ క్యాష్ కౌంటర్ , తాళాలపై వేలి ముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే, ఓ సెల్ షాపులో దుండగులు చోరీకి యత్నించగా షెట్టర్ లాక్ తెరుచుకోకపోవడంతో వెనుదిరిగారు.

రాజేష్ కన్నా సేవలు మరువలేనివి..

● టీపీయూఎస్ రెండు జిల్లాల బాధ్యులు



రాజేష్‌కన్నా మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీపీయూఎస్ బాధ్యులు

విద్యారణ్యపురి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) హనుమకొండ జిల్లా పూర్వ అధ్యక్షుడు కొల్లూరు రాజేష్‌కన్నా సేవలు మరలేనివని టీపీయూఎస్ రెండు జిల్లాల బాధ్యులు అన్నారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కొల్లూరు రాజేష్‌కన్నా సోమవారం ఉదయం హనుమకొండలోని తన నివాసంలో మృతి చెందారు. కాగా, రాజేష్ కన్నా హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా, ఆత్మకూరు, హసన్‌పర్తి మండలాల అధ్యక్షుడిగా, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగాను సేవలు అందించారు. వరంగల్ అర్బన్ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. టీపీయూఎస్ హనుమకొండ ,వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆముదాల దాత మహర్షి, బత్తిని వెంకటరమణ, బద్దిని వీరస్వామి, ఉప్పుల సతీష్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఆ సంఘం నాయకులు పిన్నింటి బాలాజీరావు, చిదురాల సుధాకర్, దాస్యం రామానుజస్వామి, మాచర్ల భిక్షపతి.. రాజేష్‌కన్నా మృతదేహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజేష్‌కన్నా మృతి టీపీయూఎస్‌కు తీరని లోటన్నారు. కాగా, హనుమకొండ ఎంఈవో రాంకిషన్‌రాజు, డీఈవో కార్యాలయం కమ్యూనిటీ మొబైలిజింగ్ కోఆర్డినేటర్‌బి రాధ కూడా నివాళులర్పిచారు.

అప్పల బాధతో కౌలురైతు ఆత్మహత్య



గోవిందు(ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం నందనాయక్‌తండాకు చెందిన కౌలు రైతు బాధావత్ గోవిందు (43) అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య, పోలీసుల కథనం ప్రకారం.. గోవిందు తమ గ్రామ శివారు కాంద్ర మాధవరావు రైతుకు చెందిన 2 ఎకరాల భూమిని మూడేళ్ల నుంచి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పెట్టుబడి కోసం గ్రామంలోని పలువురి వద్ద సుమారు రూ.6 లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. పంటలు సరిగా పండకపోవడం, అప్పులు తీరక జీవితంపై విరక్తి చెంది ఈనెల 22న కొమ్మాల పెట్రోల్ బంక్ సమీపంలో క్రిమిసంహారక మందు తాగిన గోవిందు.. ఇంటికి చేరాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. సోమవారం మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. కాగా మృతుడి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, చాడ కొమురారెడ్డి, నాగారపు స్వామి, ఆకుల రుద్రప్రసాద్ తదితరులు పరామర్శించి ఇనగాల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందజేశారు.

ధన్వాడలో మరోవ్యక్తి..



శంకరయ్య(ఫైల్)

కాటారం: బిడ్డ పెళ్లికి చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి.. ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాటారం మండలం ధన్వాడలో జరిగింది. గ్రామానికి చెందిన బోడ శంకరయ్య(50) కొంత కాలం క్రితం తన కూతురు వివాహం చేశాడు. దీంతో పాటు కొంత భూమి కౌలుకు తీసుకొని పత్తిసాగు చేయగా రూ.5లక్షల మేర అప్పు అయింది. అప్పు ఎలా తీర్చాలని తీవ్ర మనోవేదనకు గురైన శంకరయ్య సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతిడి భార్య బోడ సీరజ ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

పెగడపల్లిలో వివాహిత..

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన గంద్రాతి అరుణ కుమారుడు గురువర్ధన్ రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి అరుణ మానసిక వేదనతో బాధపడుతోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలి భర్త గంద్రాతి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

మద్యం తాగొద్దని మందలించినందుకు..

● అన్నను చంపిన తమ్ముడు ● శంకరాజుపల్లిలో ఘటన

ఏటూరునాగారం: మద్యం తాగి ఆరోగ్యం పాడుచేసుకోవద్దని తమ్ముడిని అన్న మందలించాడు. దీనికి కోపోద్రెకుడైన తమ్ముడు..అన్నను రోకలితో మోదీ చంపాడు. ఈ ఘటన సోమవారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన యానక ముత్తయ్య(55), యానక బాబు అన్నాదమ్ముళ్లు. ఈ క్రమంలో మద్యం సేవించి ఆరోగ్యం పాడుచేసుకోవద్దని తమ్ముడు బాబును అన్న ముత్తయ్య మందలించాడు. దీనిని మనసులో పెట్టుకున్న బాబు.. భోజనం చేసేందుకు పంపు వద్ద చేతులు శుభ్రం చేసుకుంటున్న క్రమంలో ముత్తయ్యను రోకలితో మోదాడు. దీంతో ముత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు దయాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మండల రాజు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నారన్నారు.

కాళోజీ ఖ్యాతిని తెలిపేలా నిర్మాణం

● చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



కాళోజీ కళాక్షేత్రం నిర్మాణంపై చర్చిస్తున్న చీఫ్‌విప్ దాస్యం, ఎమ్మెల్సీ దేశపతి, 'కుడా' చైర్మన్

హన్మకొండ/వరంగల్ కల్చరల్: కాళోజీ ఖ్యాతిని తెలిపేలా కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం ఉండాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులపై సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో 'కుడా' చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట, భాషా, సాంస్కృతిక మండలి సంచాలకుడు మామిడి హరికృష్ణ, 'కుడా' సీపీఓ అజిత్ రెడ్డి, డీఈఈ రఘునందన్ రావు, కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి, కార్యదర్శి వీఆర్ విద్యార్థి, శ్రీనివాస్‌రావు, అశోక్, నిర్మాణ బాధ్యుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్, దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ కాళోజీ కళాక్షేత్ర నిర్మాణంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాళోజీ ప్రాముఖ్యం, విశిష్టత, చరిత్ర తెలిపేలా నిర్మాణ పనుల్లో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కాళోజీ రచనలు, పుస్తకాలు, వస్తువులు ప్రత్యేకంగా పొందుపరచాలని సూచించారు. కాళోజీ జీవిత చరిత్రపై డాక్యుమెంటరీ రూపొందించి ప్రదర్శించాలన్నారు. కాళోజీ విగ్రహం, చిత్ర మాలికలకు ప్రత్యేక స్థానాలు కేటాయించాలన్నారు. 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ కళాక్షేత్ర నిర్మాణంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్మాణం ఉండాలన్నారు.

కమిషనరేట్‌కు పలువురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ



వరంగల్ క్రైం: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పలువురు ఇన్‌స్పెక్టర్లను వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చూస్తు డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ నుంచి ఎల్.ప్రవీణ్‌కుమార్, ఖమ్మం నుంచి ఎస్.రవికుమార్, సిద్దిపేట నుంచి రాజశేఖర్‌రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి నుంచి పులి వెంకట్, ఆదిలాబాద్ నుంచి జి.సతీష్‌కుమార్, జూలూరుపాడు సర్కిల్ నుంచి తాటపాముల సురేష్, ఎస్.చంద్రమోహన్‌ను కమిషనరేట్‌కు బదిలీ చేస్తే ఉత్తర్వులు వెలువడ్డాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి



యాకూబ్‌రెడ్డి(ఫైల్)

జనగామ రూరల్: ఓ రైతు.. తన పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురికావడంతో మరో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతం సంభవించి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని గోపిరాజుపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన లింగాల యాకూబ్‌రెడ్డి (35)కి రెండు ఎకరాల పొలం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురికావడంతో జనగామ విద్యుత్ కార్యాలయానికి తీసుకెళ్లాడు. అక్కడ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం అందజేస్తామని తెలిపారు. దీంతో నీరులేక తన పొలం ఎండుతుండంతో సమీపంలో ఉన్న మరో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్టార్టర్‌కు కనెక్షన్ ఇస్తుండగా ఒడ్డుపై జారిపడ్డాడు. ఈ క్రమంలో తన చేతికి కరెంట్ ప్రసరిస్తున్న తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలికి ఎస్సై అరుణ్ చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య అక్షిత ఉన్నారు.

గుట్టపై నుంచి పడి యువకుడు..



సాయికుమార్(ఫైల్)

పాలకుర్తి: మండలంలోని విస్నూరు గ్రామ గుట్టపై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన జనగామ సాయికుమార్(26) సోమవారం మద్యం తాగాడు. అనంతరం గుట్టపైకి వెళ్లగా జారి పడ్డారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సాయికుమార్ అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. దీనిపై మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

చిట్టీలు వేసి నష్టపోయాం..

● మోసగించిన వ్యక్తికి చెందిన భూమి అప్పగించి న్యాయం చేయాలి
● పల్లారుగూడ స్వయం సహాయక సంఘాల మహిళల వినతి



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

సంగెం: పొదుపు సంఘం, చిట్టీల పేరుతో సుమారు 500 మందిని మోసం చేసి సుమారు రూ.1.50కోట్లతో ఉడాయించిన వ్యక్తికి సంబంధించి భూమిని తమకు అప్పగించాలని మహిళలు వేడుకుంటున్నారు. వరంగల్ నగరంలోని అబ్బనికుంటకు చెందిన వేములపల్లి సంపత్.. 'వెంకటలక్ష్మి పొదుపు సంఘం' పేరుతో సంగెం మండలం పల్లారుగూడ గ్రామానికి చెందిన సుమారు 500 మంది మహిళల వద్ద నెలనెలా పొదుపుతో పాటు చిట్టీలు నిర్వహించాడు. అనంతరం ఏడ్లళ్ల క్రితం సుమారు రూ 1.50లతో ఉడాయించాడు. అతడికి సంబంధించి గ్రామంలో 5 గుంటల భూమి ఉంది. ఆ భూమిని గ్రామానికి చెందిన సమ్మయ్య అక్రమంగా వినియోగించుకుంటున్నాడు. దీనిపై విచారణ చేపట్టి ఆ భూమిని పొదుపు, చిట్టీలు వేసి నష్టపోయిన తమకు అప్పగించాలని వారు వేడుకుంటున్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి, సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్వర్ రావు, ఎస్సై భరత్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పల్లారుగూడ స్వయం సహాయక సంఘాల మహిళలు గుర్రం గీత, బి.పద్మ, సరస్వతి, విజయ, అరుణ, భాగ్యమ్మ, మణమ్మ సుభద్ర తదితర పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సర్కారును బొంద పెట్టడం ఖాయం

● పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి
● బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



హనుమకొండ : ధర్నాలో మాట్లాడుతున్న ఈటల, పాల్గొన్న నాయకులు

హన్మకొండ/వరంగల్: పేద ప్రజలకు సీఎం కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇళ్ల ఇవ్వకపోతే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట, పోచమ్మమైదాన్ జంక్షన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లయినా అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టియ్యలేని చేతకాని ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో కొనసాగుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ హయంలో వేల కోట్లతో కట్టిన రాజీవ్ గృహకల్ప ఇళ్లే ఇంత వరకు ఎవరికీ ఇవ్వలేదని.. దీనిని బట్టి చూస్తే పేద వాళ్లపై ఆయనకు ఎంత మమకారం ఉందో అర్థమవుతోందని అన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, పేదలు సంపాదిస్తున్న కూలీ బార్లకే పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వాడ వాడకు బెల్ట్ షాపులే రాష్ట్ర అభివృద్ధా అని నిలదీశారు. సీఎం కేసీఆర్ కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తే పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని, ఇంట్లో ఇద్దరు దంపతులకు వృద్ధాప్య పింఛన్ ఇస్తామన్నారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ వి.మురళీధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, మోలుగురి భిక్షపతి, వన్నాల శ్రీరాములు, చాడ శ్రీనివాస్ రెడ్డి, రాకేష్ రెడ్డి, గురుమూర్తి శివకుమార్, పేసరు విజయచందర్‌రెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఎడ్ల అశోక్‌రెడ్డి, వంగాల సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టాస్క్‌ఫోర్స్' అదుపులో భూకబ్జాదారులు..!

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కబ్జాలకు పాల్పడుతున్న కొంత మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఏవీ.రంగనాథ్ బాధ్యతలు స్వీకరించిన తరువాత కబ్జాదారులపై ఉక్కుపాదాం మోపడంతో వందల సంఖ్యలో పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో భూకబ్జాలకు పాల్పడుతున్న కొంత మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. నకిలీ పత్రాలు సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని విచారిస్తున్నట్లు సమాచారం.